విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 16, నవంబర్ 2023

ఎకరాకు రూ.50 వేల పంట నష్ట పరిహారం ఇవ్వాలి..

- రైతులకు అన్ని రకాల అప్పులు రద్దుచేయాలి
- గ్రామాల్లో కరువు సహాయక చర్యలు చేపట్టాలి
- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: జిల్లాలో గ్రామగ్రామాన కరువు తీవ్రంగా తాండవిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఏపీ రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున విమర్శించారు. బుధవారం రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ,ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆపార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. సీపీఐ రూరల్ మండల కార్యదర్శి రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మల్లికార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఖరీఫ్,రబీ సీజన్లలో లక్షల హెక్టార్లలో రైతులు వేసిన పంటలన్ని ఎండిపోయి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని విచారం వ్యక్తంచేశారు. జిల్లాలో 50 శాతం మంది రైతులు లక్షల ఎకరాల్లో వేసిన పంటలు నష్టపోయారని మరో 50 శాతం మంది రైతులు లక్షల ఎకరాల్లో దుక్కి దున్ని విత్తనాలు సిద్ధం చేసుకుని వర్షాల కోసం ఎదురుచూసి పంటలు వేయలేక పోయారని ఏకరువు పెట్టారు. జిల్లా వ్యాప్తంగా రైతులు ఖరీఫ్‌లో వేసిన వేరుశనగ, పత్తి, ఆముదం, కంది జొన్న,సజ్జ నష్టపోయారని, రబీలో పప్పు శనగ ఇతర పంటలు వర్షం లేక ఎండిపోవడం జరిగిందన్నారు. జిల్లా రైతులు ఇంతటి దుర్భిక్షం అనుభవిస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడం బాధాకరమన్నారు. పాలక ప్రభుత్వం ఇప్పటివరకు ఏ ఒక్క రైతును ఆదుకున్న దాఖలాలు లేవని మండిపడ్డారు. జిల్లాలో 31 మండలాల్లో కరువు తాండవిస్తుంటే కేవలం 28 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహార పంటలకు ఎకరాకు 25 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు 50 వేలు, ఉద్యాన పంటలకు ఎకరాకు లక్ష రూపాయల నష్ట పరిహారం అందజేయాలని, రైతుల అన్ని రకాల రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం యోచించి వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించాలని, కరువును జాతీ య విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, అనంతపురం రూరల్ మండల సహాయ కార్యదర్శి నరేష్, ఎఐఎస్ఎఫ్ రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి ధనంజయ, రైతు సంఘం నాయకులు వెంకటనారాయణ, గోవింద నాయక్, నగేష్, ఎర్ర పోతున్న, హనుమంతు, నాగభూషణ, వేణు, పాండు, విజయ్, వెంకటరాముడు, రెడ్డప్ప వెంకటేష్ నాయక్, మహేష్, రామాంజనేయులు, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

వరుణయాగంలో భాగస్వాములు కండి

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

విశాలాంధ్ర–శింగనమల: మండల కేంద్రంలోని ఆత్మ రామాలయం దగ్గర గురువారం జరిగే వరుణ యాగం కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివరెడ్డిలు పిలుపునిచ్చారు, అనంతరం వారు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే వర్షాలు లేక పంటలు పండక త్రాగునీరు లేక రాష్ట్రం కరువు కోరల్లో చిక్కుకుందని నియోజకవర్గ కేంద్రంలో వరుణ యాగం చేపట్టడం జరిగిందని యాగం చేపట్టిన రోజు నుండి వరుణుడు కరుణించి చెరువులు,కుంటలు, నిండి జలం పుష్కలంగా లభించిందని గుర్తు చేశారు, ఈ సంవత్సరం వర్షాలు పడక రైతులు పెట్టిన పంటలు ఎండిపోయి కరువు పరిస్థితులు అలముకున్నాయని, ప్రజల బాధలను గుర్తించి నేటి నుండి వరుణ యాగానికి సంకల్పించామని, ఈ కార్యక్రమంలో ప్రజలందరూ విరివిగా పాల్గొని విజయంతం చేయాలని కోరారు.

బాలల సర్వతోముకాభివృద్ధికి పాటుపడాలి

జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి

విశాలాంధ్ర–ఉరవకొండ: బాలల సర్వతోముకాభివృద్ధికి ప్రతిఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ ఎం.గౌతమి పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ బాలల దినోత్సవం, జాతీయ దత్తత మాసం కార్యక్రమానికి సంబంధించి ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూర్ మండల కేంద్రంలోని శ్రీ జనార్ధన వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలు, దత్తతకు సంబంధించిన పోస్టర్‌లను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా అరికట్టాలన్నారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్ళినప్పుడు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని, స్వయం సహాయక సంఘాల సమావేశాల్లో కూడా ఖచ్చితంగా ఈ విషయమై మాట్లాడాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే బైండోవర్ చేయాలని, కేసులను నమోదు చేయాలన్నారు. 18 ఏళ్ల వయసు వరకు ఉన్న బాలికలు పాఠశాలల్లో చదువుకునేలా చూడాలన్నారు. శిశు గృహంలో చిన్నారులు ఉన్నారని, ఎవరైనా తల్లిదండ్రులు చిన్నారులను దత్తత తీసుకోవాలి అనుకుంటే ముందుకు రావాలని, ఈ విషయమై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అంతకుముందు వజ్రకరూరులోని కేపీ జడ్పీహెచ్ఎస్ స్కూల్ లో పిల్లలకు ఆటల పోటీలు అవగాహన కార్యక్రమం, బాలల హక్కులు, బాల్యవాహాల వల్ల జరిగే అనర్థాలు అనే అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు అందరికీ జిల్లా కలెక్టర్ బహుమతులు అందజేశారు. న్యూట్రిషన్ ఫుడ్ ద్వారా హిమోగ్లోబిన్ బాగా పెరిగిన లేదా అభివృద్ధి చెందిన పిల్లలకు సంబంధించిన పిల్లల్ని కూడా గుర్తించి వారికి కూడా బహుమతులు అందించారు.

ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి బి.ఎన్ శ్రీదేవి, గుంతకల్లు ఆర్డీఓ వి.శ్రీనివాసులు రెడ్డి, డిఆర్డిఏ పిడి నరసింహారెడ్డి, బాలల పరిరక్షణ సమితి అధికారి ఇన్చార్జి డిసిపిఓ వెంకటేశ్వరి, శిశు గృహ మేనేజర్ దీప్తి, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, డీఈవో నాగరాజ్, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి రసూల్, గవర్నమెంట్ స్కూల్ టీచర్ కృష్ణా నాయక్, జిల్లా బాలల పరిరక్షణ సమితి వసంత, రమాదేవి, సూపర్వైజర్ పద్మ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాల్సిందే..

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రహీం

విశాలాంధ్ర–పామిడి: ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికందక నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని సిపిఐ గుంతకల్లు నియోజక వర్గం కార్యదర్శి వీరభద్ర స్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆపార్టీ అనుబంధం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.రైతు సంఘం నాయకుడు , జిల్లా సమితి సభ్యుడు రహీం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వీరభద్ర స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కరువు తీవ్రంగా ఉందని వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.30 వేల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు పి చౌడప్ప,అస్లాం ఖాన్,రైతు సంఘం నాయకులు ఈశ్వరయ్య,చిన్న ఓబులేసు, శీన,ఎర్రగుడి రాముడు,కొత్తపల్లి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రకాష్ రెడ్డికి సొంత మండలంలోని సమస్యలే పట్టడం లేదు

మాజీ మంత్రి పరిటాల సునీత

విశాలాంధ్ర–ఆత్మకూరు: రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి సొంత మండలంలోని సమస్యలే పట్టించుకోకపోతే.. ఇక నియోజకవర్గంలో ఎప్పుడు అభివృద్ధి చేస్తారని మాజీ మంత్రి పరిటాల సునీత ప్రశ్నించారు. ఆత్మకూరు మండల కేంద్రంలో బాబు షురిటీ–భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని 3వ రోజు బుధవారం కూడా కొనసాగించారు. మండల కేంద్రంలోని పలు కాలనీల నాయకులు, కార్యకర్తలతో కలసి పర్యటించి టీడీపీ మ్యానిఫెస్టోకు కరపత్రాలను ఇంటింటా అందజేశారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సొంత మండలంలో కూడా అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని.. ప్రతి కాలనీలోనూ సమస్యలు చెబుతున్నారన్నారు. ఎమ్మెల్యే సోదరులు నిత్యం దందాలు, బెదిరింపుల్లో మునిగి తేలుతున్నారన్నారు. ఎంత సేపు సొంత ఆస్తులు పెంచుకుందామనే ధ్యాస తప్ప ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన ఏమాత్రం లేదన్నారు. తెలుగుదేశం పార్టీ హయంలో జరిగిన అభివృద్ధి తప్ప నియోజకవర్గంలో ఎక్కడా అభివృద్ధి అన్నది కనిపించడం లేదన్నారు.

గురుకులాల్లో సౌకర్యాలు కల్పించండి

విశాలాంధ్ర–ఉరవకొండ: గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ. టీఎన్ఎస్ఎఫ్ ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్షులు ప్యారం భరత్‌చౌదరి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం వజ్రకరూరు మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఫిర్యాదుల కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. భరత్ చౌదరి మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం రాగులపాడులో గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలతో పాటు జిల్లా వ్యాప్తంగా వివిధ గురుకుల పాఠశాలలు దాదాపు 58 వసతి గృహాల్లో 6వేల మంది దాకా విద్యార్థులు చదువుతున్నారని, టాయిలెట్ సౌకర్యం, భోజనాలు చేయుటకు డైనింగ్ హాలు లేక ఇబ్బందులకు గురి అవుతున్నారని, కొన్నిట్లో టాయిలెట్స్ గదులను కూడా సిబ్బంది స్టోర్ రూములకు ఉపయోగించు కుంటున్నారన్నారు. జగనన్న వసతి దీవెన, అమలుచేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎస్సీ ఎస్టీ సంక్షేమ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ గుర్తించి తక్షణమే పరిష్కరించాలని పేర్కొన్నారు

కరువు సహాయక చర్యలు చేపట్టి రైతులను ఆదుకోండి

కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేసిన సిపిఐ నాయకులు

విశాలాంధ్ర–ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో కరువు నేలకున్నదని ప్రభుత్వం అన్ని మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించి వెంటనే సహాయక చర్యలు చేపట్టి రైతులను అన్ని విధాల ఆదుకోవాలని తాలూకా సిపిఐ పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్ గౌతమిని కలిసి విజ్ఞప్తి చేశారు. బుధవారం వజ్రకరూరు మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్‌ను నాయకులు కలిసి కరువు పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా తాలూకా సిపిఐ పార్టీ కార్యదర్శి జే.మల్లికార్జున మాట్లాడుతూ నష్టపోయిన పంటలకు ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని అదేవిధంగా పంటలు వేయని రైతులకు ఎకరాకు 15వేలు నష్ట పరిహారం చెల్లించాలని జిల్లాలోని 31 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని వలసలు నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా కేటాయించిన 50 రోజులు ఉపాధి కూలీలకు పని దినాలను వెంటనే కల్పించి రైతు కూలీలను ఆదుకోవాలని ఆదుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని కూడేరు ఉరవకొండ, బెలుగుప్ప మండలాల్లో మైక్రో డ్రిప్ ఇరిగేషన్ సామూహిక బిందు తుంపర సేద్యం రూ 890 కోట్ల రూపాయలతో 2017లో గత ప్రభుత్వం మొదలుపెట్టి 75 శాతం పనులను పూర్తి చేసిందని మిగిలిన 25 శాతం పనులు అలాగే ఆగిపోయాయన్నారు. హంద్రీ -నీవా హెచ్ ఎల్ సి కెనాల్ కు సాగునీరు యధావిధిగా విడుదల చేయాలని ఈ రెండు ప్రాజెక్టులకు నీరు నిలిపివేస్తే 50 వేలు ఎకరాల్లో రైతులు పంటలు నష్టపోతారని కలెక్టర్ కి వివరించారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ వజ్రకరూరు మండల కార్యదర్శి కామ్రేడ్ డి.సుల్తాన్ ఉరవకొండ నియోజక వర్గం సీనియర్ నాయకులు కామ్రేడ్ కమలపాడు పకీరప్ప, శర్మాస్ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పీకల్లోతు కష్టాల్లో మునిగిన రైతాంగం

విశాలాంధ్ర–శింగనమల: రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతూ భారత కమ్యూ నిస్టు పార్టీ (సిపిఐ) రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తాసిల్దార్ కార్యా లయం ముందు నిరసన తెలిపారు. కార్యక్రమానికి సిపిఐ శింగనమల మండల కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాల్యం నారాయణ స్వామి, శింగనమల నియోజకవర్గ కార్యదర్శి టి.నారాయణస్వామి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిన్నప్ప యాదవ్‌లు హాజరయ్యారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాల్యం నారాయణ స్వామి మాట్లాడుతూజిల్లా వ్యాప్తంగా వర్షాలు లేక రైతులు వేసిన పంటలు చేతికందక పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు పీకల్లోతప్పుల్లో కూరుకు పోయారని రుణాలను మాఫీచేసి కొత్త రుణాలు అందించి ఆదుకోవాలని, ప్రతి రైతుకు ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం అందించి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. శింగనమల సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి టి.నారాయణ స్వామి మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా కరువు ఛాయలో అలుముకుని పెట్టిన పెట్టుబడి కూడా చేతికందక నష్టాల ఊబిలో కూరుకు పోయారన్నారు. భవిష్యత్తులో సాగునీరు, తాగునీరు, దొరకదని, ముందు చూపులేని ప్రభుత్వ పాలకుల, నిర్లక్ష్యమే తేటతెల్లమవుతుం దన్నారు. వర్షాలు లేక రైతులు విలవిలలాడుతుంటే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు మధు యాదవ్, రాము, వ్య.కాసం అధ్యక్ష కార్యదర్శులు మునిస్వామి, లక్ష్మ రంగయ్య సూరి రూప్లా నాయక్, రవిశంకర్, రామ్మోహన్ రామసుబ్బారెడ్డి, నాగరాజు దుబ్బన్న, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల అన్నిరకాల అప్పులు రద్దుచేయాలి..

– సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున

విశాలాంధ్ర–అనంతపురం రూరల్: జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో బ్యాంకుల్లో ఉన్న రైతుల అన్ని రకాల అప్పులు మాఫీ చేసి గ్రామాల్లో తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. అనంతపురం రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట రూరల్ మండల కార్యదర్శి రమేష్ అధ్యక్షతన బుధవారం ధర్నా చేశారు. ముఖ్య అతిథి మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్, రబీలో సీజన్లలో లక్షల హెక్టార్లలో వేసిన పంటలన్నీ ఎండిపోయి పెట్టుబడులు కూడా రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు నేటికీ క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడం దారుణమన్నారు. జిల్లా అంతటా కరువు వుంటే కేవలం 28 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకున్నారే తప్ప రైతాంగాన్ని ఆదుకోవడానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. రైతాంగాన్ని ఆదుకోవడానికి ఆహార పంటలకు ఎకరాకు రూ.25 వేలు, వ్యవసాయ పంటలకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కరువును జాతీయవిపత్తుగా ప్రకటించాలన్నారు. నష్టపోయిన పంటలకు పంటల వారీగా నష్టపరిహారము ఇవ్వాలన్నారు. పంటలు వేయని వారికి ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలన్నారు. తక్షణమే వెంటనే ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. విద్యుత్ కోతలనుకూడా వెంటనే ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి పి రామకృష్ణ, అనంతపురం రూరల్ మండల సహాయ కార్యదర్శి నరేష్, ఎఐవైఎఫ్ ధనుంజయ, రైతు సంఘం వెంకటనారాయణ, గోవింద నాయక్, నగేష్, ఎర్ర పోతున్న, హనుమంతు, నాగభూషణ, వేణు, పాండు, విజయ్, వెంకటరాముడు. రెడ్డప్ప, వెంకటేష్ నాయక్, మహేష్, రామాంజనేయులు, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

వర్కింగ్ డేలో మెప్మా ఖాళీ

మధ్యాహ్నం 3.40లకే కనిపించని అధికారులు

విశాలాంధ్ర–అనంతపురం అర్బన్: అనంతపురం నగరంలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో బుధవారం మధ్యాహ్నం 3:40 సమయం అవుతున్నా కార్యాలయంలో ఒక్క అధికారి కూడా లేకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. మెప్మా పీడీ విజయలక్ష్మి ని ఫోన్ లో వివరణ కోరగా గుత్తి క్యాంపునకు తనతో పాటు సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ రెడ్డి వచ్చామని తెలిపింది.మధ్యాహ్నం 3 గం ల 40 ని లు కావస్తున్నా కార్యాలయంలో ఎవరు లేరని పిడి కి సమాచారం ఇస్తుండగా వెంటనే ఫోన్ కట్ చేసి విలేకరితో మాట్లాడటానికి సైతం నిరాకరించింది. నగరం నడిబొడ్డున పట్టణ పేదరిక నిర్మూలనా (మెప్మా)కార్యాలయానికి నిత్యం ప్రజలు వస్తూనే ఉంటారు. అలాంటప్పుడు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు లేకపోవడంతో ప్రజలు గంటల సమయాన్ని వెచ్చించి అసహనంగా తిరిగి వెళ్లిపోతున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి మెప్మా కార్యాలయంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

జగన్ ఎందుకు కావాలంటే ..

విశాలాంధ్ర–ముదిగుబ్బ: మండలం కేంద్రంలోని మూడవ సచివాలయంలో ఏర్పాటు చేసిన జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పెట్టిన సంక్షేమ పథకాల వలన రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరిగిందని పథకాల గురించి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి, మండల సీనియర్ నాయకులు ఇందుకురు నారాయణరెడ్డి, జెడ్పిటిసి తిరుమల సేవ్ నాయక్, వెంకటేశ్వర్ రెడ్డి సర్పంచ్ లక్ష్మి దేవి చంద్రా యుడు, ఉప సర్పంచ్ లోకేశ్వర్ రెడ్డి, మల్ల గుండ్ల భాస్కర్ ,సచివాలయ సిబ్బంది, వైయస్సార్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి..

విశాలాంధ్ర–రాప్తాడు : ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్దె ఓబులేసు కోరారు. రాప్తాడు మండలానికి నూతనంగా వచ్చిన తహసిల్దార్ సి మునివేలుకు బుధవారం ఏపీ ఎంఆర్పీఎస్ జిల్లా నాయకులు నక్కా అంజినప్ప, బెల్లం నాగప్ప, మందా ఆదిశేషులతో కలిసి శాలువాతో సన్మానించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చిన తక్షణమే పరిష్కరించాలని అన్నారు.

చంద్రబాబుతోనే ఏపీకి భవిష్యత్తు ..

విశాలాంధ్ర–అనంతపురం రూరల్: టిడిపి అధినేత చంద్రబాబును మరోసారి సీఎంగా చేసుకుంటేనే ఏపీ ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని టిడిపి శ్రేణులు అన్నారు. అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆదేశాల మేరకు బుధవారం నగరంలోని 26, 46, 2, 10, 4వ డివిజన్లలో భవిష్యత్తుకు గ్యారంటీ ఇది బాబు షూరిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను పక్కాగా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త వంకదారు వెంకటకృష్ణ, చిరోళ్ళ రామాంజనేయులు, పావురాల శేఖర్, బోయ మూర్తి, మురళి, సాదిక్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై చర్యలు చేపట్టండి

విశాలాంధ్ర–రాప్తాడు: అనంతపురం జిల్లాలో ఈ ఏడాది సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయి ఆర్థికంగా నష్టపోయారని కరువు సహాయక చర్యలు చేపట్టాలని, బీజేపీ రైతు విభాగం కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమార స్వామిని అనంతపురం జిల్లా కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి మచ్చా ఆదిశేషారెడ్డి కోరారు. బుధవారం అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను ఈ సందర్భంగా కలిశారు. అదేవిధంగా రాప్తాడు నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

దొంగలపట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర–ఓడీసీ రూరల్: ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి తన సిబ్బందితో మామిళ్ల కుంటపల్లి పంచాయతీలోని సుందరయ్య కాలనీలో బుదవారం గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఎవరు కూడా గొడవలకి వెళ్లవద్దని.. ఏమన్నా సమస్య ఉంటే పోలీస్‌స్టేషన్‌కి రావాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో కర్ణాటక లిక్కర్‌ను అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండా లని, దొంగతనాలు చేసే గ్యాంగ్‌లు, చెడ్డీగ్యాంగ్ లాంటివి తిరిగే అవకాశం ఉం దని ఎవరిపైన అయిన అనుమానం వస్తే పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని, విలువైన ఆభరణాలు, అధిక మెత్తంలో డబ్బును ఇంట్లో పెట్టుకోకుండా బ్యాంక్‌లో దాచుకోవాలని సూచించారు.డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

శాఖలు పార్టీకి పట్టుకొమ్మలు

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాల్యం నారాయణస్వామి

విశాలాంధ్ర–శింగనమల : సిపిఐ మండల సమితి సమావేశం పార్టీ మండల కార్యదర్శి తరిమెల రామాంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం సిపిఐ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాల్యం నారాయణస్వామి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి టి నారాయణస్వామి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చెన్నప్ప యాదవ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాల్యం నారాయణస్వామి మాట్లా డుతూ మండల వ్యాప్తంగా సిపిఐ పార్టీ నూతన శాఖలు ఏర్పాటు చేసుకోవాలని, మండల నాయకత్వం కృషి చేయాలన్నారు. పార్టీలో చురుకైన కార్యకర్తలను గుర్తించి ప్రజా సంఘాలకు బాధ్యులను చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజక వర్గ అధ్యక్ష కార్యదర్శులు మధు యాదవ్, రాము, వ్య.కా.సం మండల అధ్యక్షులు మునిస్వామి, లక్ష్మీ రంగయ్య, రామ సుబ్బారెడ్డి, రూప్లా నాయక్, రవిశంకర్, రామ్మోహన్, నాగరాజు, దుబ్బన్న పాల్గొన్నారు,

శింగనమల సిపిఐ మండల కమిటీ రద్దు.. సిపిఐ శింగనమల మండల కమిటీని రద్దు చేస్తున్నట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాల్యం నారాయణ స్వామి, నియోజకవర్గ కార్యదర్శి టి నారా యణస్వామిలు తెలిపారు. నూతన కమిటీ ఎన్నిక అయ్యేంతవరకు నియోజకవర్గ కార్యదర్శి నారాయణ స్వామి ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 16, నవంబర్ 2023

వైయస్ జగన్‌తోనే... అభివృద్ధి.. సంక్షేమం..

వైసీపీ హయాంలోనే వ్యవసాయానికి పెద్దపీట

ఎమ్మెల్యే శంకర నారాయణ

విశాలాంధ్ర-గోరంట్ల: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి.. సంక్షేమం.. జరుగుతోందని సత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షులు పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోరంట్ల మండలంలోని రెడ్డిచెరువు పల్లి పంచాయతీలో గల రెడ్డి చెరువు పల్లి గ్రామంలో 39 లక్షలతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల వ్యవసాయ గోడౌన్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ మంగమ్మతో కలిసి నిర్వహించారు. కాలేకుంట్లపల్లి గ్రామంలో తిరుమల శ్రీవారి టిటిడి వారి సహకారంతో రూ 10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న భజన మండలి భవన నిర్మాణానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భూమి పూజ నిర్వహించారు. అలాగే గుత్తి వారి పల్లి గ్రామంలో 39 లక్షలతో 500 మెట్రిక్ టన్నుల వ్యవసాయ గోదాము నిర్మాణానికి పూజలు నిర్వహించి భూమి పూజ కార్యక్రమం నిర్వహించి, పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి పెద్దపీట వేశామని, దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ వార్డు సచి వాలయ వ్యవస్థతో పాటు ప్రతి గ్రామపంచాయతీ కేంద్రంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయ పనిముట్లు అందించడంతోపాటు సిబ్బంది అందుబాటులో ఉండి రైతులకు వ్యవసాయానికి అవసరమైన సూచనలు సలహాలు అన్ని రకాల విత్తనాలు ఎరువులు అందించడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు, రైతులు కూడా ఆర్బికే కేంద్రాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో నిర్వీర్యం అయిపోయిన సహకార సంఘాలను బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి ఎన్నో ప్రయోగాత్మక స్కీములు పెట్టడంతో పాటు వ్యవసాయ గోదాములు కూడా నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ,సర్పంచ్ వినోద్ కుమాం జెడ్పిటిసి పాలే జయరాం నాయక్, గోరంట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ బూదిలి వేణుగోపాల్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు రఘురామిరెడ్డి, శివశంకర్ రెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, వైస్ ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి, తహసిల్దార్ రంగనాయకులు, మండల అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, జడ్పీ కో ఆప్షన్ డాక్టర్ భాషా, మండల సచివాలయ సమర సింహా రెడ్డి పాల్గొన్నారు.

కృష్ణా జలాలపై ఇచ్చిన జీవోను రద్దు చేయాలి

విశాలాంధ్ర-పుట్టపర్తి: కృష్ణానది జలాల పునః పంపిణీ సంబంధించిన జీవనం వెంటనే రద్దు చేయాలని శ్రీ సత్య సాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో మేరకు గోడ పత్రికలు విడుదల చేశారు. వేమయ్య యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కృష్ణానది జలాల పునః పంపిణీ పై దంతరంగా జీవో విడుదల చేయడం అన్యాయమన్నారు. ఈనెల 20 21 తేదీలలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర నాయకులు కలిసి విజయవాడలో దీక్ష చేపట్టారన్నారు. ఈ జీవ రద్దు చేయాలని విజయవాడలో 30 గంటల పాటు నిరసన కార్యక్రమం చేపడుతున్నా మన్నారు. ఈ జీవో రద్దు చేయడం వల్ల రాయలసీమ ప్రాంతానికి నీటి కరువు ఏర్పడుతుందన్నారు. రాయలసీమ ప్రాంత ప్రజలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. రాయలసీమలో నీటి కొరత వల్ల ఇతర రాష్ట్రాలకు పోలీసులు వెళ్లాల్సి వస్తుందన్నారు. కృష్ణానది జలాల పైన కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని లేనిపక్షంలో ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంకటనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి మరొక్క అవకాశం కల్పించండి..

- మాజీ ఎమ్మెల్యే సుధాకర్...

విశాలాంధ్ర-రొళ్ల: కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో మడకశిర నియోజకవర్గన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని అభివృద్ధి పరిచిన కాంగ్రెస్ పార్టీకి మరొక్కసారి ఆశీర్వదించాలని సత్యసాయి జిల్లా అధ్యక్షుడు మడకశిర మాజీ ఎమ్మెల్యే కె.సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం బి.జి హళ్లి.మల్లీనామడుగు పంచాయతీలో పరిధిలోని టి.డి పల్లి,జి.జి హొట్టి అగ్రహారం, మల్లసముద్రం, హెచ్.టి హళ్లి, హెచ్.టి వడ్రహట్టి, జీరిగేపల్లి, కాలువపల్లి తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ ముందడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ప్రజలను అభ్యర్థించారు. రఘువీరారెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ ఇల్లు సీ.సీ రోడ్లు రైతులకు ఇన్పుట్ సబ్సిడీ ఇన్సూరెన్స్ అమృత హస్తం క్రింద ప్రతి ఒక్క రేషన్ కార్డుదారునికి 9 రకాల నిత్యవసర సరుకులు గ్రామాలకు త్రాగునీటి కోసం శ్రీరామిరెడ్డి పథకం హంద్రీనివా కాలువ ద్వారా కృష్ణ జలాలు తీసుకు రావడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు.

పోలియో బాధితులకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-ధర్మవరం: పుట్టుకతోనే పోలియోతో బాధపడుతున్న ఇద్దరు పిల్లలకి పట్టణంలోని ఇందిరా నగరుకు చెందిన లయన్స్ టీం మిత్ర బృందం రూ.21,600లను ఆర్థిక సహాయం కింద అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ టీం వారు మాట్లాడుతూ పట్టణంలోని ఒకటవ వార్డు శాంతినగర్కు చెందిన చింతా రామకృష్ణ అనే చేనేత కార్మికునికి ఇద్దరు పిల్లలు పుట్టుకతో పోలియోతో జన్మించారని, 11 సంవత్సరాల నుండి తల్లిదండ్రులే వారికి అన్ని సేవలు చేస్తూ ఆర్థికంగా చితికిపోయారని తెలిపారు. ఈ విషయం ఇటీవల సోషల్ మీడియాలో రావడంతో తాము స్పందించి లయన్స్ టీం సభ్యుల తరఫున ఆర్థిక సహాయాన్ని వారి ఇంటికి వెళ్లి సహాయాన్ని అందించినట్లు చెప్పారు. ఇటువంటి సేవా కార్యక్రమం ఆనందంతో కూడిన తృప్తినిచ్చిందని తెలిపారు. కార్యక్రమములో పూజారి రమేష్,చింత విజయ్, భాస్కర్, చంద్ర, చింత విజయ భాస్కర్, రాఘవేంద్ర, రాజు, మురళి, విశ్వనాథ్, నాగరాజ్, భద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ టీంకు వివేకానంద డిగ్రీ విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-ధర్మవరం: యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ టీంకు తమ వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రిజ్వాన్ భాషా తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనివర్సిటీ టీముకు ఎంపికైన విద్యార్థులు, అంతర యూనివర్సిటీ లీగ్ లో బాల్ బాడ్మింటన్‌లో పాల్గొంటారని తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభ సభలో రిజ్వాన్ భాషా మాట్లాడుతూ కళాశాల తరఫున విద్యార్థులు కదిరిలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొని ఫైనల్స్‌లో రన్నర్స్‌గా నిలిచారని తెలిపారు. ఇలాగే మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు, విద్యార్థులు, రిజ్వాన్ భాషా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏహో. కరీముల్లా, అధ్యాపక బృందం, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

డాక్టర్ చెన్నారెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం: విద్యార్థులందరూ కూడా వ్యక్తిగత పరిశుభ్రత తప్పకపాటిస్తే చక్కటి ఆరోగ్యం లభిస్తుందని శ్రీ సత్యసాయి జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ పర్యవేక్షణ అధికారి డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్తపేట మున్సిపల్ బాలికల పాఠశాల తోపాటు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను వారు సందర్శించి విద్యార్థులకు రక్త పరీక్షలను చేయించారా? తదుపరి ఐరన్ మాత్రలను వేస్తున్నారా? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రత వల్ల కలిగే ఉపయోగాలతో పాటు ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హైస్కూల్, ప్రాథమిక, హెడ్మాస్టర్లు పాల్గొన్నారు.

సూర్య హై స్కూల్ విద్యార్థుల అన్నదానం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని సిద్దయ్య గుట్టలో గల తిక్క స్వామి దేవాలయంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్య హై స్కూల్ విద్యార్థులు దాదాపు 60 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ విద్యార్థులు మాట్లాడుతూ తమ బాలల దినోత్సవ పురస్కరించుకొని ఈ సేవలు చేయడం మాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. పాఠశాల హెచ్ఎం. నరేంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థుల కోరిక మేరకు ఈ అన్నదాన పంపిణీ కార్యక్రమాన్ని చేయడం మాకు కూడా ఎంతో గర్వంగా ఉందని తెలిపారు. ముమ్ముందు విద్యార్థులు పాఠశాల ద్వారా సేవా కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. అనంతరం తిక్కస్వామి గుడి కమిటీ వారు విద్యార్థులకు కృతజ్ఞత ఆశీస్సులను తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పోతులయ్య, ప్రభావతి, కళావతి, మారుతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

విశాలాంధ్ర-గుడిబండ: స్థానిక మహాత్మా జ్యోతిరావుపులే బాలికల కళాశాలలో ఆర్.డి.టి, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు ఆర్డిటి సెక్టార్ టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన గుడిబండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ మహిళా శిశు అభివృద్ధి పథక అధికారిని శ్రీమతి పద్మా వతి, ఆర్డిటి మడకశిర రీజినల్ డైరెక్టర్ మల్లి కార్జున, గుడి బండ ప్రాజెక్ట్ మహిళా శిశు అభివృద్ధి పథక అధికారి పద్మావతి మాట్లా డుతూ నేటి సమా జంలో బాలల పట్ల వివక్షత తీవ్రరూపం దాల్చిందని బాల్య వివాహాలు, బాల లపై లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నా యని, బాలలను కాపాడాల్సిన బాధ్యత అందరి పైనా ఉందని తెలిపారు. చిన్న వయసులో బాల్య వివాహాలు చేయడం వల్ల ఆడపిల్లలు మానసికంగా, శారీరకంగా తీవ్రమైన ఒత్తిడికి గురై ప్రసవ సమయంలో తల్లిబిడ్డ ప్రాణాలు కోల్పోతారని అని తెలుపుతూ ఆడపిల్లలకు 18 సంవ త్సరాలు మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహాలు చేయాలన్నారు. ఆర్డిటి మడకశిర రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ఆర్డిటి సంస్థ కర్ణాటక సరిహద్దు మండలాల్లో ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణ కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు.

కక్షలు మాని ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోండి..

నియోజకవర్గ టిడిపి ఇంచార్జి పరిటాల శ్రీరామ్

విశాలాంధ్ర-తాడిమర్రి: గ్రామాలలో కక్షలు మాని ప్రశాంతమైన జీవనాన్ని అలవర్చుకోవాలని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు బుధవారం మండల పరిధిలోని పిన్నతిరి గ్రామ పంచాయతీలో పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో ఇంటింటా చెట్లు నాటే కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్కు గ్రామపంచాయతీలో ప్రజలు అడుగున బాణ సంచాలు పేలుస్తూ, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలుకుతూ, కర్పూర హారతులు మధ్య ఘన స్వాగతం పలికారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం తప్పక ప్రభంజనం సృష్టిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా కక్షలు, కారుణ్యాలు మానుకొని ప్రశాంతమైన జీవనం గడిపినప్పుడే, సుఖవంతమైన జీవితంలో లభిస్తుందని తెలిపారు. అందుకే నేడు ఈ చెట్టు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించామని పరిటాల రవి ఆశయాలు నెరవేరుస్తామని వారు తెలిపారు. నేడు వైఎస్ఆర్సిపి ప్రభుత్వం చేపట్టిన వాటిపై రాష్ట్ర ప్రజలందరూ కూడా విసుగు చెందారని, మార్పు కోసం తెలుగుదేశం పార్టీని ఎంపిక చేయడం ఖాయమని వారు తెలిపారు. ఇక వైఎస్ఆర్సిపి దాడులకు, అక్రమాలకు, అడ్డుకట్ట వేస్తామని తెలిపారు. తదుపరి వందలాదిమంది కార్యకర్తలకు నాయకులకు మాజీ సర్పంచ్ బసినేని విశ్వనాథ్ భోజన ఏర్పాటు చేయడం పట్ల పరిటాల శ్రీరామ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పిన్నదరి మాజీ సర్పంచ్ బసినేని విశ్వనాథ్, మాజీ సర్పంచ్ కేశవ నారాయణ, మండల కన్వీనర్ కూచి రాము, సర్పంచుల సంఘం అధ్యక్షులు గోనుగుంట్ల భూషణ, గోనుగుంట్ల విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ పూల ఓబయ్యపల్లి అశ్వత్, మాజీ ఎంపీపీ కొణిదెల రాజశేఖర్, తాడిమర్రి మండల మాజీ కన్వీనర్ కొణిదెల సాయికుమార్, రామానాయుడు, కునుకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి, పిన్నదరి ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సాకే లక్ష్మీనారాయణ, ఆకులేటి శీనా, పిన్నదరి ఆటో రామాంజి, పంచాయతీ తెలుగుదేశం కన్వీనర్ రాజశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సజ్జలను కలిసిన బిహెచ్ రాయుడు

విశాలాంధ్ర-గుడిబండ: వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు, ప్రభుత్వ ముఖ్య సలహాదారి సజ్జల రామకృష్ణ రెడ్డిని మడకశిర నియోజకవర్గం గుడిబండ మండలం తిమ్మాలపురం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, దళిత నాయకుడు బిహెచ్ రాయుడు బుధవారం తాడేపల్లి (విజయవాడ) లోని సజ్జల క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ మేరకు తన కుటుంబం నేపథ్యం, సామాజిక రాజకీయ సేవలు, విలేకరిగా పనిచేసిన అనుభవం, 2014 ఎన్నికల సమయంలో మడకశిర నియోజకవర్గంలోని బలమైన నాయకులు సూచన మేరకు స్వయానా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన ఎంఎల్ఏ టికెట్ విషయాన్ని బలంగా పరిశీలించడం తదితర విషయాలను ఫోటోలతో సహా సజ్జలకు క్లుప్తంగా వివరిస్తూ మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని తన బయోడేటా ఇస్తూ కోరారు. సావధానంగా విన్న సజ్జల బయోడేటాను చదివి పరిశీలిస్తామని, పార్టీ అభివృద్ధికి, పార్టీ మళ్ళీ అధికారంలోకి రావడానికి కష్టపడి పని చేయాలని సూచించినట్లు బి హెచ్ రాయుడు తెలిపారు.

ర్యాగింగ్, మాదకద్రవ్యాలు వద్దు..

విశాలాంధ్ర-పెనుకొండ: ర్యాగింగ్, మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్‌కి బాటలు వేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జెవివిఎన్ కేశవరావ్, పట్టణ ఎస్.ఐ రాజేష్ పిలుపునిచ్చారు. స్థానిక పిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగపు ఆధ్వర్యంలో జరిగిన "యాంటీ ర్యాగింగ్, యాంటీడ్రగ్ అబ్యూస్"పై అవగాహన కార్యక్రమంలో హాజరైె విద్యార్థులకు అవగాహన కల్పించారు. భావిభారత పౌరులుగా, విద్యార్థు లందరికీ చట్టాలపై కనీస అవగాహన ఉండాలని, సమాజానికి హాని కలిగించే వ్యక్తులపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు ఫోక్సో చట్టాలపై కూడా గ్రామీణ ప్రాంతాల్లోని వారికి అవగాహన కల్పించే బాధ్యతను విద్యార్థులే తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జయప్ప, రంగనాయకులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

కులగణనపై నేడు శిక్షణ కార్యక్రమం..

విశాలాంధ్ర-గోరంట్ల: శ్రీ సత్య సాయి జిల్లా, జిల్లా పంచాయతీ అధికారి శివకుమారి ఆధ్వర్యంలో గోరంట్ల గ్రామ సచివాలయం -1(సెరి కల్చర్ ఆఫీస్) నందు గురువారం 16న మధ్యాహ్నం 3 గంటలకు కుల గణన సర్వే విధానంపై ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో రఘునాథ్ గుప్తా తెలిపారు, మండలం లోని పంచాయతీ కార్యదర్శులు అన్ని గ్రామ సచివాలయాల సిబ్బంది ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కు హాజరుకావాలని కోరారు.

జనసేన టీడీపీ నాయకులు సమన్వయంతో పని చేయాలి

మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి: జనసేన టిడిపి నాయకులు కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం సమన్వయంతో పని చేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ మనస్పర్ధలు లేకుండా తెలుగుదేశం జనసేన పార్టీల నాయకులు కార్యకర్తలు కలిసి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. ప్రభుత్వంపై చేపట్టే ఏలాంటి ఆందోళనైనా ఇరు పార్టీల నాయకులు కలిసికట్టుగా పోరాడి ముందుకెళ్లాలని నాయకులకు పిలుపునిస్తున్నామన్నారు.వైసిపి ప్రభుత్వం అక్రమాలను అన్యాయాలను తెలుగుదేశం పార్టీ జనసేన నాయకులు కలసికట్టుగా ప్రశ్నించాలని సూచించారు. ఇరు పార్టీల ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అంతేకాకుండా ఓటర్ వెరిఫికేషన్ అవకతవతలు కలిసి ప్రశ్నించాలన్నారు. అనంతరం పుట్టపర్తి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజల కష్టాలను తీర్చడానికి ప్రజల తరపున ప్రశ్నించడానికి జనసేన పార్టీ ఆవిర్భావమైందని జనసేన తెలుగుదేశం కూటమి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసమేనని, ఇరు పార్టీ నేతలు సమన్వయంతో కష్టపడి కృషిచేసి జనసేన తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలి అన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గవ్యాప్తంగా తెలుగుదేశం జనసేన పార్టీల నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విమల సాహితి జాతీయ పురస్కారానికి ఎన్నికైన జాబిలి

విశాలాంధ్ర-పెనుకొండ: స్థానికఉపాధ్యాయుడు, కవి, రచయిత, సంపాదకుడు, సమాజిక సేవా కార్యకర్త అయిన జాబిలి చాంద్ బాషాకు విమలా సాహితి ఫౌండేషన్ అధ్యక్షుడు జెల్ది విద్యాధర రావు 'విమల సాహిత్య జాతీయ పురస్కారాన్ని' ప్రకటించారు. ఈ పురస్కా రాన్ని ఈ నెల 19వ తేదీ హైదరాబాద్ లోని సుదరయ్య విజ్ఞాన కేంద్రంలో అందుకోబోతున్నారు. గత ఇరవై ఐదు సంవత్సరాలుగా జాబిలి సాహితీ సామాజిక సేవా కార్యక్రమాలు చెస్తూ అనేక మంది సాహితీ కారులను ప్రోత్సహిస్తున్నారు. దేశభక్తి, పర్యావరణ పరిరక్షణ, మత సామరస్యం అంశాలతో విద్యార్థులను, సమాజాన్ని జాగృత పరుస్తున్నారు. మట్టిని ముద్దాడిన మనిషి, మిలన్, శాంతి పూల దేహం ఈ మూడు పుస్తకా లను రచించారు. అనంత సాహిత్యఅకాడమి, సత్యసాయి జిల్లా రచయితల సంఘాలకు అధ్యక్షులుగా ఉంటూ రాష్ట్ర జాతీయ స్థాయిలో అనేక కార్యక్రమాలు నిర్వహించి మెరుగైన సమాజం కోసం పాటుపడుతున్న జాబిలిని జిల్లా రచయితల సంఘం సభ్యులు, డా.శివన్న, డా.బాస్కర్ నాయుడు, మాణిక్యం ఇసాక్,ఉమర్ ఫారూక్, జయసింహ అభినందించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు..

రొద్దం, విశాలాంధ్ర స్థానిక గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాల అధికారి నాగరాజు ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ పుస్తక ప్రదర్శనలో స్వతంత్ర సమరయోధుల జీవిత చరిత్రలు, నవలలు పురాణ గాథలు, పోటీ పరీక్షల పుస్తకాలు ప్రదర్శించారు. గ్రంథాలయ అధికారి నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులు వయోజనులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పోటీ పరీక్షలకు నూతన పుస్తకాలు ఎంతో తోడ్పాటు

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు: ప్రభుత్వం సరఫరా చేసిన నూతన పుస్తకాలు పోటీ పరీక్షలకు హాజరై యువతకు ఎంతగానో ఉపయోగపడతాయని గ్రంథాలయ అధికారి రాజాబాబు పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన చేశారు. డీఎస్సీ, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4, ఇంగ్లీష్ గ్రామర్ ఇతర పోటీ పరీక్షలకు పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు

ఓటర్ల జాబితాలో అందరికీ న్యాయం

రాజకీయ పార్టీల సమావేశంలో ఆర్డిఓ రమేష్ రెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం: ఓటర్ల జాబితాలో అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని అదేవిధంగా ఇప్పటివరకు ఫారం-6, ఫారం-7, ఫారం-8లలో మరోసారి విచారణ జరిపి పూర్తి న్యాయం చేకూర్చుతామని ఆర్డీవో రమేష్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆర్డిఓ కార్యాల యంలో ఆర్డిఓ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ నేతలతో ఎన్నికల విషయమై స్పెషల్ సమ్మర్ రివిజన్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఓటర్లు తొలగింపులు, బదిలీలు, నూతన ఓటర్ల నమోదుపై గల విధివిధానాలపై చర్చించారు. తదుపరి రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ డెత్ అయిన వారు, పునాదులు గలవారు ఓటర్లు కూడా ఉన్నాయని వాటిని తొలగించే దిశగా వెనువెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా దొంగ ఓట్ల ఏరివేతలో ప్రత్యేక చర్యలు తీసుకుంటేనే పరిష్కారం అవుతుం దని విన్నవించారు. తదుపరి ఆర్డీవో మాట్లాడుతూ రాజకీయ నేతల ద్వారా వచ్చిన ఫిర్యాదులను తప్పక స్వీకరించి అనుకున్న గడువులో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని బీఎల్ఓలతో, ఎమ్మార్వోలతో మరోసారి సమావేశాన్ని నిర్వహించి, సమగ్రమైన జాబితా వచ్చే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. బిఎల్‌వోలు గాని, సంబంధిత అధికారులు గానీ ఓటు ప్రక్రియ విషయంలో తప్పిదాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పారదర్శకతో కూడిన న్నికల ప్రక్రియ విధానం జరగాలన్నారు. బి ఎల్ వో లు కూడా జిల్లా ఎన్నికల కేంద్రం ద్వారా వచ్చిన ఫిర్యాదులను వెనువెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు 39,578 నియోజకవర్గ వ్యాప్తంగా ఫిర్యాదులు అందాయని వాటిని పూర్తి దశలో కూడా పనిచేయడం జరిగిందన్నారు. ఇంకను 6,023 తొలగింపుల విషయంలో విచారణ జరిపి తొలగించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చక్కటి ఆరోగ్యానికి యోగ పరిష్కారం

విశాలాంధ్ర-ధర్మవరం: చక్కటి ఆరోగ్యానికి యోగా ఒక్కటే పరిష్కారమని యోగా మాస్టర్ నరసింహులు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ యోగా అభ్యసన అనేది వయసుతో పనిలేదని, ఏ వయసులో ఉన్న వారైనా యోగా చేస్తే ఆరోగ్యం కుదుటపడుతుందని తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 5:30 నుంచి 6:30 వరకు యోగా కేంద్రంలో అన్ని వయసులో ఉన్న వారికి వివిధ యోగాసనాలు, ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, భుజించే ఆహారము, విశ్రాంతి తీసుకునే పద్ధతి తదితరాలను యోగా అభ్యాసకులకు తెలియజేశారు. ముఖ్యంగా విద్యార్థులకు బాలల దినోత్సవం సందర్భంగా ఎన్నో ఆసనాలను చేయించడం జరిగిందని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు చదువుతోపాటు చక్కటి యోగాను నేర్పించే విధంగా వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా కేంద్రం అధ్యక్షులు గుర్రం వేణుగోపాల్, ఎస్వి సుబ్బా శెట్టి, టీచర్ నాగరాజు, విద్యార్థులు, సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఉజ్వల భవిష్యత్తుకు నాంది

గ్రంథాలయ అధికారిని. అంజలి సౌభాగ్యవతి, రిటైర్డ్ హెచ్ఎం. ముత్యాలప్ప

విశాలాంధ్ర-ధర్మవరం: గ్రంథాలయాలు ఉజ్వల భవిష్యత్తుకి నాంది అవుతాయని గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి రిటైర్డ్ హెచ్ఎం. ముత్యాల ప్రసాద్, ముకుంద తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాలు భాగంగా రెండవ రోజు బుధవారం పుస్తక ప్రదర్శన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రంథాలయంలోని వివిధ పుస్తకాలను ప్రదర్శనగా ఏర్పాటు చేసి, ఆ పుస్తకాల యొక్క వివరాలు, వాటి యొక్క ప్రాధాన్యతను విద్యార్థులకు, నిరుద్యోగులకు వారు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమయాన్ని వృధా చేయకుండా, ఇలాంటి పుస్తకాలను తిలకించి, వాటి ద్వారా విజ్ఞానాన్ని పెంపొందిం చుకుంటే భవిష్యత్తు బంగారు భవిష్యత్తు అవుతుందని తెలిపారు. అదేవిధంగా పాఠకులు గ్రంథాలయం నుండి తీసుకున్న పుస్తకాలను ఎప్పటికప్పుడు తిరిగి గ్రంథాలయానికి చేర్చాలని, ఎటువంటి జరినామా ఉండదని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రమణ నాయక్, శివమ్మ, గంగాధర్, పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు ట్యాంకు వితరణ

విశాలాంధ్ర-ధర్మవరం: మండల పరిధిలోని మల్కాపురం గ్రామములో గల పంచాయతీ పాఠశాలకు ఒక వాటర్ ట్యాంక్ ను దాత వంకదారి రామచంద్ర గుప్తా, తన భార్య కీర్తిశేషులు వంకదారి సుజాతమ్మ జ్ఞాపకార్థం కుమార్తెలు నీరజ దేవి, షర్మిల, హేలసా దేవిల చేతులమీదుగా హెడ్మాస్టర్ చంద్రమోహన్ కు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం తోపాటు ఉపాధ్యాయులు దాతకు యువర్స్ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో యువర్ ఫౌండేషన్ అధ్యక్షులు వై కే. శ్రీనివాసులు, కార్యదర్శి సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ,డాక్టర్. బి వి. సుబ్బారావు, బల్లపల్లి రంగనాథ్, బండి నాగేంద్ర, జయంతి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కురువుల గుడి కట్టు సంబరాలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-కొత్తచెరువు: కురువుల గుడికట్టు సంబరాలను విజయవంతం చేయాలని సత్యసాయి జిల్లా కురుబ సంఘం జిల్లా అధ్యక్షులు సామకోటి ఆదినారాయణ, గౌరవ అధ్యక్షులు శివానంద, జనరల్ సెక్రెటరీ రమేష్ తెలిపారు. ఈనెల 19వ తేదీ అనంతపురంలో గుడికట్టు సంబరాలు నిర్వహిస్తున్నందున గ్రామాల్లోనే కురుబ సంఘం నాయకులు కురుబ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. 250 గుడి కట్లనను ఒకేరోజు ఒకే ప్రాంతంలో ముక్కోటి ప్రతిరూపాలైన బీరప్ప స్వాములను దర్శించి ప్రాచీన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని అన్నారు. మరుగన పడుతున్న ఆచారాలను కట్టుబాట్లను పునరుద్ధరి(ద్రి)ంచి నేటి తరం యువతకు తెలియచెప్పాలన్నారు, అనంతరం కొత్తచెరువులో టీటీడీ కళ్యాణ మండపం ఆవరణంలో ఈ పోస్టర్లను విడుదల చేశారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

సీపీఐ అధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

విశాలాంధ్ర-యాడికి: పెద్దవడుగూరు మండల కేంద్రంలో పంటలు నష్టపోయిన రైతులందరికీ పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని, రైతుల అన్ని రకాల పంట రుణాలు రద్దు చేయాలని, వెంటనే ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతూ సిపిఐ మండల కార్యదర్శి వెంకటరాముడు యాదవ్ ఆధ్వర్యంలో సిపిఐ నాయకులతో కలిసి తహసిల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట రాముడు యాదవ్ మాట్లాడుతూ జిల్లాలోని 31 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని గత 50 సంవత్సరాలలో ఎప్పుడూ లేని కరువు ఈ సంవత్సరం వచ్చింది అన్నారు, సకాలంలో వర్షాలు రాక వేసిన పంటలన్నీ ఎండిపోయాయన్నారు, దీనివల్ల రైతులు లక్షలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టి తీవ్రంగా నష్టపోయారు అన్నారు, కావున ప్రభుత్వము రైతులు తీసుకున్న పంట రుణాలు వెంటనే రద్దుచేసి కొత్త రుణాలు ఇవ్వాలన్నారు, అదేవిధంగా ఆహార పంటలకు ఎకరాకు 25 వేల రూపాయలు, అగ్రికల్చర్ పంటలకు ఎకరాకు 50వేల రూపాయలు, హార్టికల్చర్ పంటలకు ఎకరాకి లక్ష రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఇప్పటికే వరస కరువుల వల్ల రైతాంగం పూర్తిగా దెబ్బతిని ఆర్థికంగా నష్టపోయారున్నారు, వెంటనే ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దార్ నాగభూషణముకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు నారాయణ, హుస్సేన్ పీరా, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పోలారంగస్వామి, సిపిఐ నాయకులు శ్రీనివాసరెడ్డి, ఆదినారాయణ యాదవ్, నారాయణస్వామి, సుధాకర్ గౌడ్, బాల నారాయణ, వేణుగోపాల్, రఘురామయ్య, పెద్ద నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 16,నవంబర్ 2023

బాబు తోనే భవిష్యత్తు గ్యారెంటీ

విశాలాంధ్ర - నార్పల: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయకత్వంతోనే ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్‌కు గ్యారెంటీ అని తెదేపా నియోజకవర్గ బాధ్యురాలు బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు. నార్పల మండల పరిధిలోని నడిమిదొడ్డిలో బుధవారం బాబుతోనే భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మినీ మేనిఫేస్టోను గ్రామ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు వైసీపీ పాలనలో చిన్నాభిన్నమయ్యాయన్నారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రజలకు మోసంచేస్తోందని ఆరోపించారు. అనంతరం కరప త్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో జీసి బాబు, పూజారి నర్సింహులు,నరసయ్య,లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గ్రంధాలయంలో పుస్తక ప్రదర్శన

విశాలాంధ్ర-లేపాక్షి: స్థానికశాఖ గ్రంధాలయం లేపాక్షి లో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా గ్రంధాలయాధికారి జయసింహరాజు మాట్లాడుతు పుస్తకం ఒక మంచి నేస్తమని, పుస్తకాలు చదివే అలవాటును చిన్ననాటి నుంచి అలవరుచుకోవాలన్నారు. ఈ పుస్తక ప్రదర్శనతో అధ్యాత్మిక ఇతిహాసాలు, కవితలు, నవలలు, చిన్న పిల్లల కథల పుస్తకాలతో పాటు వివిధ రకాల పుస్తలకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

మండలంపై దృష్టి సారించండి

విశాలాంధ్ర-ఉరవకొండ: వర్షా బావ పరిస్థితులు వల్ల జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను అంచనా వేసి అన్ని మండలాలను కూడా కరువుగా ప్రకటించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని, వ్యవసాయ కూలీలు వలస నివారించడానికి ఉపాధి హామీ పని దినాలు పెంచాలని జిల్లాలో తాగునిటీ సమస్య తలెత్తకుండా యుద్ధప్రాతిపాదికన చర్యలు తీసుకోవాలని, స్వచ్ఛభారత్ కార్మికులకు రావలసిన బకాయిలను చెల్లించాలని, అటవీ భూములు సాగు చేసుకుంటున్న లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో ఇల్లు లేని నిరు పేదలను గుర్తించి ఇల్లు స్థలాలు మంజూరు చేయాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని వైఎస్ఆర్సిపి పార్టీ రాష్ట్ర యువనేత కొనకొండ్ల భీమిరెడ్డి బుధవారం వజ్రక రూరు మండల కేంద్రంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గౌతమిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

విద్యతోనే జీవితాల్లో వెలుగులు

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని జూనియర్ కళాశాల వద్ద ఉన్న శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ అధికారి బి.రవికుమార్ నాయుడు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుండే ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. చినిగిన చొక్కా అయినా తొడుక్కో ఒక మంచి పుస్తకం కొనుక్కో అని అన్నారు. పుస్తకం ఒక మంచి నేస్తం అని నేటి చరిత్ర భావి తరాలకు అందించే ఒక అద్భుతమైన రూపమే పుస్తకం అని అన్నారు. అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానమనే జ్యోతిని మనలో వెలిగించి ముందుకు నడిపే సాధనమే పుస్తకమని విద్యార్థు లకు సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయులు అనిల్, విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు.

తాహసిల్దార్ ను సత్కరించిన స్వర్ణకారులు

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని తాహసిల్దార్ కార్యాలయంలో బుధ వారం స్వర్ణకారుల సంఘం సభ్యులు తాహసిల్దార్ అలెగ్జాండర్ ను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వర్ణకారుల సంఘం సభ్యులు మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన తాహసిల్దార్ అలెగ్జాండర్ తన విధి నిర్వహణలో ప్రజలకు మంచి సేవలు అందించాలని కోరుకుంటూ మర్యాద పూర్వకంగా కలసి తాము తాహసిల్దార్ అలెగ్జాండర్ ను సత్కరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పథకాలతోనే సుస్థిరాభివృద్ధి

విశాలాంధ్ర - బుక్కరాయసముద్రం : ప్రజా సంక్షేమ పథకాలతోనే సుస్థిరాభివృద్ధి సాధించామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం బుక్కరా యసముద్రం మండలం వెంకటాపురం,దయ్యాల కొండపల్లి గ్రామంలో గడపగ డపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే.. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని క్షుణ్ణంగా ఆయా కుటుంబా లకు వివరించారు.స్థానికులు సమస్యలను అడిగి తెలుసుకుని వేగవం తంగా పరిష్కారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యాసారుడు ఆలూరు సాంబశివారెడ్డి, ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు, వాలంటీర్లు, పాల్గొన్నారు.

నేడు ఉరవకొండ ఎంపీపీ ఎన్నిక

విశాలాంధ్ర-ఉరవకొండ: నేడు ఉరవకొండ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులుకు ఎన్నిక జరగనున్నది గతంలో పనిచేసిన ఎంపీపీ చందా చంద్రమ్మ రాజీనామాతో ఎన్నిక ఏర్పడింది. రెండవసారి వైస్ ఎంపీపీ గా ఉన్న వెలిగొండ, గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు నరసింహులు గురువారం ఎంపీపీగా ఎన్నిక కానున్నారు. వైఎస్ఆర్సిపి పార్టీ అధిష్టానం ఏకగ్రీవంగా ఆయనను ఎంపిక చేసింది. ఎన్నికకు సంబంధించి అధికారులు ఏర్పాటు చేశారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-రాప్తాడు: నాలుగున్నర ఏళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు పార్టీలక తీతంగా సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జడ్పిటిసి పసుపుల హేమావతి అన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని బుధవారం ప్రసన్నాయపల్లి గ్రామంలో నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను, అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అదేవిధంగా గ్రామంలో వాలంటీర్లతో కలిసి ఇంటింటా తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసీపీ కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్తిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పెద్ద శ్రీనివాసులు, కల్పన, నాయకులు మధుసూదన్ రెడ్డి, వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి, మన్నల రవికుమార్, శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైయస్సార్ బీమా నగదు అందుచేత

విశాలాంధ్ర - పెనుకొండ : మండల పరిధిలోని కొండంపల్లి గ్రామంలో సోమవారం మరణించిన వైఎస్ఆర్సిపి కార్యకర్త మహేశ్వర్ రెడ్డి కుటుంబానికి వైఎస్ఆర్ బీమా నుంచి బుధవారం వారి తల్లి లక్ష్మీదేవికి 10,000 వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ జమీర్ మరియు వైఎస్ఆర్సిపి నాయకులు గోపాల్ రెడ్డి, నారాయణ, అంజి నాయక్, ఆదినారాయణ ,జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-బొమ్మనహాల్: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు పద్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. వివిధ శాఖల నివేదికలను ఆయా అధికారులు చదివి వినిపించారు. సమస్యలపై ఎలాంటి చర్చ చేయకుండానే సమావేశం ముగిసింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై, వాటిని పరిష్కరించేలా సమావేశాలు ఉండాలి కానీ, ఇలా నామామాత్రంగా సమావేశాలు నిర్వహించడం ఎందుకని ప్రజలు మండిపడుతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు సర్వసభ్య సమావేశం దృష్టికి ఏ ఒక్కరు తీసుకు రాలేదు. ప్రభుత్వ పాఠశాలలో నాడు నేడు పనులు ఎప్పుడు పూర్తయితాయని శ్రీధరఘట్ట సర్పంచ్ యోగేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. నేమకల్లు గ్రామాల్లో ఒక ఎకరం కూడా తరి లేదని ఇలాంటి పరిస్థితుల్లో వర్షాలతోనే పంటలు పండించుకుంటున్నారని వర్షాలు లేకున్నా సమయంలో కూడా కరువు మండలం గా ఎందుకు ప్రకటించలేదని సర్పంచ్ పరమేష్ అధికారులను ప్రశ్నించారు దీంతో ఏవో సాయికుమార్ మాట్లాడుతూ ఇదివరకే ఉన్నది అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తుది జాబితాలో ప్రకటించవచ్చు అన్నారు. ప్రధానమంత్రి యోజన పథకం కింద పక్క గృహాలు 10 గ్రామ పంచాయతీ పరిధిలో గృహాలు జరుగుతున్నాయని గత ప్రభుత్వంలో కట్టుకున్న గృహాలకు రూ. 21లక్షలు బిల్లులు పెండింగ్లో ఉన్నాయని ఏఈ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో తాహాశీల్దార్ శ్రీనివాసులు ,వైసీపీ నాగరత్నమ్మ, ఈఓపిఆర్డి విజయమ్మ, విద్యుత్ ఎఈఈ లక్ష్మిరెడ్డి, పశు వైద్యాధికారి వెంకటరెడ్డి, పిఆర్ జేఈఈ జగదీష్, ఆర్డబ్ల్యూఎస్ జేఈ చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాధికార సామాజిక బస్సు యాత్ర

విశాలాంధ్ర - హిందూపురం : హిందూపురం నియోజకవర్గం పరిధిలో రాష్ట్ర ఎనర్జీ , ఫారెస్ట్, ఎన్విరాన్మెంట్, సైన్స్ అండ్ టెక్నాలజీ, మైన్స్, జియలజీ శాఖ మాత్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, శ్రీ సత్య సాయి జిల్లా ఇన్చార్జ్, రాష్ట్ర లేబర్, ట్రైనింగ్, ఫ్యాక్టరీస్ శాఖామాత్యులు గుమ్మనూరు జయరాం నేతృత్వంలో నిర్వహించిన సాధికార సామాజిక బస్సుయాత్రలో డిప్యూటీ సియం అంజాద్ బాషా, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖమంత్రి ఉషాశ్రీ చరణ్, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి బోయ గిరిజమ్మ, శాసనసభ్యులు సత్య సాయి జిల్లా ఇంచార్జ్ మాలగుండ్ల శంకర్ నారాయణ హిందూపురం నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ టీ యన్. దీపికవేణు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ప్రాధాన్యత ఇస్తూ సామాజిక సాధికారత మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపిన ఘనత మన ముఖ్యమంత్రివర్యులు శ్రీ వై.యస్ జగన్ మోహన్ రెడ్డి గారికే దక్కుతుందని, రానున్న రోజుల్లో మరొక్కమారు జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ప్రజలపై ఎంతైనా ఉన్నదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శాసన సభ సభ్యులు శ్రీ దుద్దెకుంట శ్రీధర్ రెడ్డ, శ్రీ పివి సిద్దా రెడ్డి, తిప్పేస్వామి, శాసన మండలి సభ్యులు మంగమ్మ, పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్, కృష్ణయ్య, మాజీ పార్లమెంట్ సభ్యులు బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, హిందూపురం మునిసిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ, అనంతపురము వై.యస్.ఆర్.సి.పి జిల్లా అధ్యక్షులు, నియోజక వర్గ జడ్.పి.టి.సి లు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, వివిధ కార్పొరేషన్ చైర్ పర్సన్లు, డైరెక్టర్లు, వై.యస్.ఆర్.సి.పి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు శస్త్ర చికిత్సలు

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న 15 మంది చిన్నారులకు కంటి శస్రసికిత్సల కోసం పుష్పగిరి కంటి వైద్యశాల కడపకు జిల్లా త్వరిత చికిత్స కేంద్రం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.నారాయణస్వామి పంపడం జరిగిందని పేర్కొన్నారు. బుధవారం స్థానిక సర్వజన ఆస్పత్రిలో ఉన్న డిఈఐసి కేంద్రం నుంచి పుష్పగిరి కంటి వైద్యశాలకు చిన్నారులను పంపడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌బిఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి జి.నారాయణస్వామి మాట్లాడుతూ.. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఈ బి. దేవి, కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారి ఆదేశాల మేరకు ప్రభుత్వ నిబంధనలకు లోబడి గుర్తించబడిన పుష్పగిరి కంటి ఆసుపత్రి కడప వారికి జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి సత్వర చికిత్సలకై విచ్చేసిన అప్పుడే పుట్టిన వయసు బిడ్డ నుంచి 18 సంవత్సరములు వయస్సు వరకు గుర్తించబడిన కంటి లోపాలు గల 15 మంది చిన్నారులతో బాలల దినోత్సవం నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం కడప జిల్లాకు ఉచిత రవాణా, భోజన వసతి కల్పిస్తూ తదుపరి శస్త్ర చికిత్సల నిర్వహించడం జరుగుతుందన్నారు.అనంతరం తిరిగి పుష్పగిరి కంటి ఆసుపత్రి నుంచి వారి సహాయకులు ద్వారానే ఉచితంగా రవాణా సౌకర్యం కల్పిస్తూ అనంతపురం జిల్లాకు ఈ పిల్లలను మరియు వారి సహాయకులను తీసుకురావడం తీసుకొని రావడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య చిన్నపిల్లల వైద్య నిపుణులు, మేనేజర్ రజిత, ఆప్టోమెట్రీషియన్ జ్ఞాన ప్రసన్న, డిఈఐసి సిబ్బంది,పుష్పగిరి కంటిఆసుపత్రి సహాయకులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

సజావుగా మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-యాడికి: యాడికి మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ భవనం నందు ఎంపీపీ బొంబాయి ఉమాదేవి అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది, యాడికి మండలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు పలు అంశాలపై వివరించారు, విద్యుత్ శాఖ అధికారి వారికి సంబంధించిన అంశాలను వివరిస్తుండగా ఎంపిటిసి సభ్యుడు నాగరాజు విద్యుత్ పై పలు సమస్యలను ప్రస్తావించారు, ముఖ్యంగా యాడికి మండల కేంద్రంలో విద్యుత్తు సరిగా ఉండడం లేదని ఒక్కొక్కసారి రెండు గంటలైనా కూడా విద్యుత్ సరఫరా రాకపోవడం మొదలైన సమస్యలను తెలుపగా విద్యుత్ అధికారి ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా చూసుకుంటామని తెలిపారు, అలాగే రవాణా శాఖ అధికారి వారి పరిధిలోని అంశాలను తెలుపగా ఎంపీటీసీ సభ్యులు నాగరాజు తూట్రాళ్లపల్లి సర్పంచ్ సంజీవ రాయుడు బస్సు సౌకర్యాలు సరిగా ఉండడం లేదని ముఖ్యంగా ఎక్స్ ప్రెస్ సర్వీస్లన్నీ కూడా రాయల్ చెరువు బైపాస్ మీద వెళుతున్నాయని వెంటనే అధికారులు బైపాస్ మీద వెళ్తున్న బస్సు సర్వీస్ అన్నిటిని యాడికి మండల కేంద్రం నుంచి వెళ్ళునట్లుగా చర్యలు చేపట్టాలని సూచించారు. వైస్ ఎంపీపీ చెన్నప్ప వైద్యులు ఆరోగ్య కేంద్రాల్లో సరిగా ఉండడం లేదని తెలుపగా సంబంధిత వైద్యుడు ఉదయం తొమ్మిది నుంచి నాలుగు గంటల వరకు అందుబాటులో ఉంటామని తెలిపారు,అనంతరం ఎంపీపీ బొంబాయి ఉమాదేవి మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి తోడ్పడాలని, ఏవైనా సమస్యలు ఉంటే మాదృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి వెంకటేష్,యాడికి సర్పంచ్ పందు అనురాధ, ఎంపీటీసీ సభ్యులు వెంకట్ నాయుడు,నాగరాజు,రామ్మోహన్, నాగమణి ఇతర గ్రామాల సర్పంచులు,ప్రజా ప్రతినిధులు,అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కో ఆపరేటివ్ సొసైటీ గోడౌన్ నిర్మాణాన్ని ఆపాలి

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బ మండలం జొన్నల కొత్తపల్లి 51 సర్వేనెంబర్ రెవిన్యూ పొలం పరిధిలోని కో-ఆపరేటివ్ సొసైటీ కి సంబంధించిన గోడౌన్ ను వాగు నందు నిర్మిస్తున్నారు, వాగులో నిర్మించడం వల్ల భవిష్యత్తులో రాబోయే ఉపద్రవాల వల్ల జనావాసాలకు నష్టం కలగవచ్చు కావున వాగు నందు గోడౌన్ ను నిర్మించకుండా ప్రత్యామ్నాయ స్థలంలో నిర్మించేలా చర్యలు తీసుకోవాలంటూ బుధవారం మండల తాసిల్దార్ జి నాగేంద్ర కు ముదిగుబ్బ బీజేపీ నాయకులు దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో భాజపా మండల కన్వీనర్ నారాయణస్వామి, జయకృష్ణ, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల్లో స్టూడెంట్ జీరో అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని సబ్ కలెక్టర్ కి వినతి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ బ్రాంచ్ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో స్టూడెంట్ జీరో అకౌంట్ వెళ్లి అడిగితే నిరాకరించడంతో బుధవారం పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవో కి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు.. ప్రభుత్వం విద్యార్థి విద్యార్థులకు వసతి దీవెన లాంటివి వారి వారి ఖాతాల్లో పడడానికి జీరో అకౌంట్ చేసుకోవలసిన అవసరం స్టూడెంట్ కు ఎంతైనా ఉంది కానీ బ్యాంకు వారు నిరాకరించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులతో గురవుతున్నారు. వెంటనే బ్యాంకు మేనేజర్లు బ్రాంచ్ మేనేజర్లు చొరవ తీసుకొని అధికారులకు తగిన సూచనలు అందించాలని వినతి పత్రంలో కోరారు.

చెట్లు నరికే విషసంస్కృతి వద్దు...ప్రశాంతతే ముద్దు

తాడిమర్రిలో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసిన పరిటాల శ్రీరామ్

విశాలాంధ్ర- తాడిమర్రి : గ్రామాలలో చెట్లు నరికే విషసంస్కృతి వల్ల ఒరిగేది ఏమీ లేదని కావున ఫ్యాక్షన్ రూపుమాపడానికి తన వంతు కృషి చేస్తున్నానని తెదేపా ధర్మవరం నియోజకవర్గం బాధ్యుడు పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. బుధవారం తాడిమర్రి మండలం పూల ఓబయ్యపల్లి, పిన్నదరి గ్రామాలలో ఇంటింటికి తిరిగి మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. త్వరలో తెదేపా ప్రభుత్వం వస్తుందని పేదలందరికీ కూడా సంక్షేమ పథకాలు అందిస్తామని సూచించారు. తాడమర్రి మండలంలో పదివేల మొక్కలు పంపిణీ చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్రకార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్, మండల కన్వీనర్ కూచి రాము, మాజీ సర్పంచ్‌లు విశ్వనాధ్, కేశవనారాయణ, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, మాజీ ఎంపీపీ రాజశేఖర్, లక్ష్మీనారాయణ,ఆటో రామాంజి పాల్గొన్నారు.

గ్రంధాలయంలో పుస్తక ప్రదర్శన

విశాలాంధ్ర - ఎన్‌పికుంట : మండల కేంద్రంలోని స్థానిక గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహిం చారు.గ్రంథాలయంలోని వివిధ రకాల పుస్తకాలను పాఠకులకు ప్రదర్శన నిమి త్తం ఉంచి వాటి గురించి గ్రంథాలయ అధికారిని తెలియజేశారు. గ్రంథాలయ అధికారిణి శాంతమ్మ,పాఠకులు, పాల్గొన్నారు.

రాగి పంట సేకరణ

విశాలాంధ్ర-పెనుకొండ: మండల పరిధిలోని ఎర్రమంచి గ్రామం నుండి 22 క్వింటాళ్లు దుద్దె బండ గ్రామం నుంచి 12 క్వింటాలు రాగి పంట ను బుధవారం వ్యవ సాయ అధికారులు మరియు సివిల్ సప్లై అధికారులు రైతుల నుండి పంటను సేకరించారు. రైతులకు క్వింటాలకు 3846 రూపాయలు మద్దతు ధర ఇస్తున్నామని రైతులు విరివిగా రాగి పంట పండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి జిల్లా సివిల్ సప్లై మేనేజర్ అశ్వత్, నారాయణ నాయక్, స్వయంప్రభ శంకర్ నాయక్, సి ఎస్ డి టి ప్రభావతి, ఇస్లాపురం సింగల్ విండో అధ్యక్షులు ప్రకాష్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోండి



విశాలాంధ్ర - కొత్తచెరువు : గ్రంథాలయాలలో పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెం పొందించుకోవాలని, ఎంఈఓ జయచంద్ర తెలిపారు. శాఖా గ్రంథాలయంలో రెండవ రోజు పుస్తక ప్రదర్శన పుస్తక పఠనము ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు పాఠకులు నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు, పుస్తకాలు పత్రికలు చదవడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు అన్నారు. విద్యార్థులు దురాలవాటులకు గురి కాకుండా ఉండాలన్నారు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శివయ్య చౌదరి, రిటైర్డ్ ఎంపీడీవో మహమ్మద్, పాఠకులు సుబ్రమణ్యం, రాఘవ, మోహన్, అటెండర్ మునీర పాల్గొన్నారు.

ఘనంగా సహకార సంఘం వారోత్సవాలు

విశాలాంధ్ర-రొళ్ల: స్థానిక మండల కేంద్రంలోని 70వ సహకార సంఘాల వారోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సింగల్ విండో అధ్యక్షుడు మోతిరామ్ నాయక్ అధ్యక్షతన కార్యాలయం ముందు పథకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బంది కష్టపడి పని చేసి తమ సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని సహకార సంఘాల నుండి రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు ఇచ్చి రైతులను ప్రోత్సహించాలని కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సబ్ డివిజనల్ సహకార అధికారి మునిరత్నమ్మ, పిఏసిఎస్ డైరెక్టర్లు ప్రకాష్ గౌడ్, తిప్పేమల్లప్ప, మడకశిర సబ్ డివిజనల్ ఆడిటర్ కే.వెంకటరెడ్డి, ఏడిసిసి బ్యాంక్ మేనేజర్ జయరామ్ చౌదరి,ఏడిసిసి బ్యాంక్ సూపర్వైజర్ పాపిరెడ్డి,సొసైటీ సీఈవో ఏ.హనుమంతరాయ, కాంతరాజు ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మరియు సిబ్బంది పాల్గొన్నారు..

భక్త కనకదాస విగ్రహ ప్రదాత



విశాలాంధ్ర-పెనుకొండ: రొద్దం మండల కేంద్రంలో మాజీ మంత్రి వర్యులు కీర్తి శేషులు తన తండ్రి రామచంద్ర రెడ్డి జ్ఞాపకార్థం కురుబల ఆరాధ్య దైవం శ్రీ భక్త కనకదాసు విగ్రహంను అందచేసిన విగ్రహ ప్రదాత టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాష్ట్ర కురుబ కార్పొరేషన్ మాజీ చైర్పర్సన్ సవిత అనేకమంది కురుబ కుల పెద్దలు పాల్గొని విగ్రహ ప్రధాతను ఘనంగా సన్మానించారు.

బీసీల ఐక్య పోరాటం సభకు తరలి వెళ్లిన తెదేపా నాయకులు

విశాలాంధ్ర-ఎన్ పి కుంట: మండలములోని తెదేపా బీసి నాయకులు శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రంలోని బ్రహ్మణపల్లి శ్రీనివాస కల్యాణ మండపం లో బుధవారం జరుగుతున్న తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం సమావేశానికి మండల తెదేపా నాయకులు తరలి వెళ్లారు. తెదేపా మండల బీసీ నాయకులు ఆధ్వర్యంలో మండలానికి చెందిన పలువురు బీసీలు బీసీ లకు ప్రభుత్వ నమ్మక ద్రోహం పై ఐక్య పోరాటం లో కులసంఘాల ,ప్రజా సంఘాల అఖిలపక్షాలతో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంకు మండల తెలుగుదేశం నాయకులు తరలి వెళ్లారు. బీసీలకు ప్రస్తుత ప్రభుత్వం నమ్మకద్రోహం చేసిందని మండల తెదేపా నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి వంకమద్ది నరసింహులు, టిడిపి నాయకులు అంజనప్ప నాయుడు, శ్రీరాములు నాయుడు, వేమన్న, సుధాకర్ నాయుడు, టైలర్ శివశంకర్ పాల్గొన్నారు.